రాగము - మధ్యమావతి - ఆదితాళము

పాహి రామప్రభో - పాహి రామప్రభో
పాహి భద్రాద్రివైదేహి రామప్రభో!॥ ॥పాహి॥

శ్రీమన్మహాగుణస్తోమాభిరామ మీ
నామకీర్తనలు వర్ణింతు రామప్రభో!
సుందరాకార మన్మందిరోద్ధార సీ
తేందిరా సంయుతానంద రామప్రభో! ॥పాహి॥

ఇందిరాహృదయారవిందాధిరూఢా
ఇందిరాకార సానంద రామప్రభో!
ఎందునేఁ జూడ మీ సుందరానందముల్
కందునో కన్ను లింపొంద రామప్రభో! ॥పాహి॥

బృందారకాదిప - ద్బృందార్చితపదార
విందసందర్శితానంద రామప్రభో!
తల్లివీనీవె మా తండ్రివినీవె మా
దాతవునీవె మా భ్రాత రామప్రభో! ॥పాహి॥

పన్నగాధిపశయన భావనాతీత సం
పన్న నామనవి వినవన్న రామప్రభో!
ఏటివాక్యంబు మీ సాటిదైవంబు ము
మ్మాటికి భువి లేదు మేటి రామప్రభో! ॥పాహి॥

నీదు బాణంబులను నాదుశత్రుల బిట్టు
బాధింపకున్నా వదేమి రామ...!
ఆదిమధ్యాంతబహిరంతరాత్ముడ వనుచు
వాదింతు నే జగన్నాథ రామ...! ॥పాహి॥

శరణాగతత్రాణ బిరుదాంకితంబైన
వరము నా కొసఁగు మేమఱక రామప్రభో!
శ్రీరామ నీనామ చింతనామృతపాన
సారమే నాదుమది గోరు రామప్రభో! ॥పాహి॥

పాహి శ్రీరామ నీపాదపద్మాశ్రయుఁడ
పాలింపుమీ భద్రశైల రామప్రభో !
సాహి రామప్రభో పాహి రామప్రభో!
పాహిభద్రాద్రి వైదేహి రామప్రభో!

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/